# విజిగీషి

రచన :
శ్రీ గొబ్బూరు రాఘవేంద్రరావు.

ఆకాశములో నలుదిశల మబ్బులు అలముకున్నాయి. ప్రకృతిఅంతా గాఢాంధకారమయమయింది. ఆచీకట్లోనే కాలుసాగిస్తున్నాడతడు. అతని హృదయంకూడా అంధకారమయమయింది. తళుక్కున ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. అవును, అతని జీవితంలోకూడా ఒక మెరుపు మెరిసి మాయమయింది. అదే శ్రీలత. ఆమెను తల్చుకుంటూనే, దుఃఖపూరితమయింది అతని మనసు.

* * *

రవి ఫారెస్టు డిపార్టుమెంటులో వుద్యోగిగా వున్నపుడే శ్రీలతతో వివాహమయింది. ఆమె అతని జీవితములో ప్రవేశించగనే, రవి ఆఫీసరయినట్లు వర్తమానం వచ్చింది. అతనిమనసు నాడెంత వుప్పొంగిపోయిందో చెప్పలేడు.

తన జీవితమును ఆమె లతవలె పెనవేసుకొనవలెనని, ఆమెజీవిత సర్వస్వమని తలచాడు. తనొక మహావృక్షమని, ఆమె మాధవీలతవలె తనజీవితమును చుట్టుకొని వుంటుందని వూహించాడు.

మధురస్వప్నాలతో ఏడాదిగడచింది. ఒకరోజున తను తండ్రికాబోతున్నాడని తెలిసినప్పుడు, అబ్బ, తన ఆనందం ఎవరికీరాదు. భార్యకు ముద్దులను కానుకగా యిచ్చాడు.

రవి ఆఫీసునుండి యింటికివచ్చేటప్పుడు ప్రతిరోజూ పూవులు తెచ్చి శ్రీలతకిచ్చేవాడు. ఆ సుగంధపరిమళమును వెదజల్లే తెల్లని కుసుమాలు ఆమెజుట్టుకు ఎంతో అందాన్నిచ్చేవి. వాటిని సిగలో తురుముకుని నడుస్తూంటే, ఎంతో నిండుతనముగా వుండేది.

ఒకరోజురాత్రి తను అడిగాడు, 'లతా! ఈ సమయంలో నీకేమికోరికలున్నాయో చెప్తే వాటిని తీరుస్తాను'.

'నాకున్న కోరికల్లా ఒక్కటే. మీరు కలకాలం సుఖంగా జీవించాలని కోరుతున్నాను.'

'పిచ్చిలతా! నీలాంటి స్త్రీ నావెంట జంటగా వున్నపుడు సుఖంకాక, కష్టాలువస్తాయా?' అన్నాను ఆమె ముఖంవైపుచూస్తూ.

ఆరోనెలవచ్చేసరికి అత్తగారువచ్చి శ్రీలతను పుట్టింటికి తీసుకొనివెళ్ళారు. ఆమె వెళ్తున్నప్పుడుకూడ, 'మీ ఆరోగ్యంజాగర్త' అని చెప్పి మరీ వెళ్ళింది. తనకు ఆమె పురిటికివెళ్ళినరోజులు ఎంత దుర్భరంగా గడిచాయో చెప్పలేడు. రాత్రిళ్ళు నిద్రపట్టదు. పగలు ఆఫీసులో కూడా ఆమె మూర్తేకనిపించేది. అప్పుడప్పుడు మూడు, నాలుగురోజులు శెలవుపెట్టి, వెళ్ళిచూసి వచ్చేవాడు. ఎంతోనిండుగా నవ్వుతూ తనకు స్వాగతమిచ్చేది. కాన్పు వచ్చేరోజులలో ఆఫీసుపని ఎక్కువై అక్కడకు వెళ్ళలేకపోయాడు.

ఒకనాడు...ఆరోజు, తను ఈనాడేకాదు, ఈజీవితకాలంలోకూడా మర్చిపోని సంఘటన.

'మగపిల్లవాడు. శ్రీలతసీరియస్' అని టెలిగ్రాం చూసేసరికి, తలతిరిగినట్లయింది. వెంటనే బయలుదేరి అక్కడకు వెళ్ళాడు.

ఇంట్లో అందరూ కంగారుగా తిరుగుతున్నారు. అత్తగారువిని చూసి, 'రా నాయనా! నీకోసమేచూస్తున్నాం' అంది.

ఆగదిలోకి వెళ్ళేసరికి, డాక్టరు శ్రీలతకు యింజక్షను యిస్తున్నాడు. ఆమె నీరసించి, వదలిపోయిన లతవలె వుంది.

ప్రక్కనే వుయ్యాలలో, ముద్దులొలుకుచున్న పిల్లవాడు పడుకొనియున్నాడు. ఆమె తనని గుర్తించినట్లు లేదు. మగతగా కన్నులుతెరచి చూస్తోంది. 'లతా! నేను వచ్చేశాను. గుర్తించలేదా' అని దీనంగా మాట్లాడాడు.

శ్రీలత మెల్లిగా తలత్రిప్పి తనవేపు చూసింది.

'వచ్చారా! అదుగో మనబాబు, ఇక వాడిబరువు, బాధ్యతలు మీపైన పెడుతున్నాను' అంది.

'అవేంమాటలులతా! నీకేమికాదని డాక్టరుచెప్పాడు. నిశ్చింతగా పడుకో' అన్నాడన్నమాటేగాని అతనిహృదయంలో అగ్నిగోళాలు, సెగలు కక్కుతున్నాయి.

'లేదండీ, నాకుతెలుసు. కానీ, మీరు సుఖంగా జీవించాలనే కోరుతున్నాను. అవసరమయితే, మీరు రెండో...' కానీ పూర్తిగా మాటరాకుండానే 'అబ్బా' అని, కళ్ళు తేలవేసింది.

ఒక్క వుదుటున రవిబయటకు వెళ్ళి, 'డాక్టర్! నా లతను బ్రతికించండి. నాజీవితమును అంధకారం చేయకండి' అని అరచాడు. వెంటనే డాక్టరు లోపలికొచ్చి, నాడిచూసి, 'సారీమిస్టరు రవి! మానవ ప్రయత్నం చేశాము. కానీ అది సఫలీకృతంకాలేదు' అని బయటికి నడచాడు.

'లతా' అంటూ అక్కడే రవి కూలబడ్డాడు.

* * *

తనజీవితంలో వెన్నెల వెలుగును ప్రసరింపచేసిన, శ్రీ లత, ఆవెన్నెలలో తను హాయిగా తిరుగుతున్నప్పుడు, తనను విడచి దూరలోకాలకు వెళ్ళిపోయింది. తనజీవితం అంధకారమయమయి, దుర్భరంగా గడపవలసిన పరిస్థితి ఏర్పడింది.

తను ఈమోడువారిది జీవితాన్ని ఎన్నాళ్ళని గడపగలడు? ఈవేదనతో, విరహముతో తనుకూడా ఎప్పుడో ...

'బాబు ఏడుపువినిపించింది.' వెంటనే లేచి వెళ్ళి వాడిని ఎత్తుకున్నాడు.

అవును, తను బాబు కోసరము జీవించాలి. వాడిబరువు బాధ్యతలను భరిస్తానని శ్రీ లతకు మాటయిచ్చాడు. ఆ మాటను నిలబెట్టి, ఆమెకు శాంతిని కలుగజేయాలి.

బాబుజీవితములో ఆశాజ్యోతిని వెలిగించి, ఆవెలుగులో తను జీవించాలి. కాని, తను పిల్లవాడిని రక్షించగలడా? అదే మాటనాన్నగారు అన్నారు.

'బాబును మాదగ్గరవుంచరా, యిక్కడ ఏలోటు లేకుండా పెంచుతాము.' కానీ తను బాబును విడచి వుండలేడు. బాబుకళ్ళల్లో శ్రీ లతరూపాన్ని పరికించి తన్మయత పొందే తను, వాడిని ఏ విధంగాను దూరంచేసుకోలేడు.

కానీ, యిప్పుడు తన కర్తవ్యం?

తన ఆఫీసుపనికి, బాబు పెంపకానికి సామ్యంకుదరదు. లేకపోతే తను మరో పెళ్ళి...

అబ్బ, శ్రీ లతకు అన్యాయం చేయలేడుతను. ఇంట్లో వాళ్ళందరూకూడా రెండో పెళ్ళికి తమ సమ్మతిని తెలియజేశారు.

'ఇంకా పాతిక ఏళ్ళుదాటకుండానే వైరాగ్యం ఏమిటిరా! ఆ పసివాని భవిష్యత్తునకైనా నీవు పెళ్ళిచేసుకోవాలిరా!' అంటుంది అమ్మ.

కానీ తనజీవితంలో మరియొకరికి స్థానంలభించదు. తన అనురాగాన్ని, అవాజ్యమైన ప్రేమను మరియొక స్త్రీకి సమర్పించగలడా? ఏమో!

తనచంచలమైన మనస్సు వలనైతేమి, బాబు సంరక్షణ నిమిత్తమైతేనేమి, తను మళ్ళీ గృహస్థుడయ్యాడు.

భవిష్యత్తుమీద ఆశ మానవుని జీవించేటట్లు చేస్తుంది. ఆ ఆశేలేకపోతే, భూమిమీద మానవుని మనుగడకు అర్థంలేదు.

ఆశా, తనజీవితంలోకి క్రొత్త ఆశలతో ప్రవేశించింది. ఇరువదిసంవత్సరములు నిండని ఆశా, ఆమె తల్లిదండ్రుల లేమిస్థితివల్ల తన అర్ధాంగిఅయింది. తను ఆరోజే చెప్పాడు.

'నాకు జీవితంపై ఏవిధమైన కోరికాలేదు. కాని, బాబు భవిష్యత్తుకే నేనీపనిచేసినా నాకు నీపూర్తి సహకారం లభ్యమవుతుందని ఆశిస్తున్నాను.'

'తప్పకుండా! మీ సంతోషసౌఖ్యాలుతప్ప నాకు కావలసినదిలేదు. నేను సవతితల్లినని మీరు సందేహించనక్కరలేదు. బాబు సౌఖ్యంకన్న కావలసినదిలేదు' అని ఆశా పలికినపుడు తనమేను పులకరించింది.

కాలగమనం దొర్లుతోంది. బాబు చిన్నచిన్న మాటలు అంటున్నాడు. ప్రొద్దున్నే ఆశా, బాబుచే శ్రీలత ఫోటోకి దండంపెట్టిస్తూంది. అప్పుడు తను అనుకునేవాడు. కఠోరమనస్కులైన సవతి తల్లులతోబాటే, సౌమ్యహృదయంగలవారు కూడ లోకంలో లేకపోలేదని.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేసరికి బాబురడీగా తయారై గుమ్మంలో నిలబడేవాడు. తను వాడినిఎత్తుకుని లోపలకొచ్చేసరికి, కాఫీగ్లాసుతో ఆశా ప్రత్యక్షమయేది.

శ్రీ లత ఫోటోచూసేసరికి, అప్రయత్నముగా పాత సంగతులు స్మృతిపథంలోకొచ్చి, కన్నులు ఆర్ద్రమయేవి.

రోజులు నిర్లిప్తంగా గడుస్తునాయి. తను కాంపులకు కూడా వెళ్ళవలసి వస్తున్నది.

ఒకరోజు వచ్చిన వుత్తరంలో అమ్మ యిలా వ్రాసింది. 'ఇప్పుడు ఆశా వట్టిమనిషి కాదని, ఆమెచే బరువుపనులు చేయించవద్దని' అంటే తనకు మరియొకసంతానం.

అవు త్తరం ఆశాకి చూపించినప్పుడు ఆమె సిగ్గుతో అక్కడనుంచి వెళ్ళిపోయింది.

తన మనస్సు పరిపరివిధాల ఆలోచిస్తూంది. ఇప్పుడు ఆశా తన స్వంతబిడ్డ సంరక్షణలో, బాబును ఆదరించదేమో? ఛా! తను అలా ఎందుకనుకోవాలి. యిన్నాళ్ళు తన కన్నబిడ్డలా బాబుపై మమకారం పెంచుకొన్న ఆశా, తన స్వంతబిడ్డనుచూసి, దూరం చేయదుకదా? ఏమో. అటువంటి ఆలోచనవచ్చినందుకు తనను తానే నిందించుకున్నాడు.

ఆరోజులగాయితు, ఆమెచేసే ప్రతిపనిలోనూ తనకు ఏదోలోపంవున్నట్టే కనిపిస్తూంది. అది తనవూహే కావచ్చు.

మనసుకు సహజత్వం లోపించినపుడు, ఎదుటివారి క్రియలు సమంజసమయినను, కర్తవ్య విహీనముగా గోచరిస్తాయి.

చిత్రకారుడు కుంచెతో రంగులను కాగితంపైచేర్చి, ఒక ఆకారాన్ని సృష్టిస్తాడు. శిల్పికూడా రాయిని వులితో చెక్కి ఆకృతిని తయారుచేస్తాడు. కానీ, సృష్టికరణలో యిద్దరూ వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. ఒకడు క్రొత్తవిచేరుస్తే, రెండవవాడు వున్నవాటిని తొలగించే ఆకృతి కల్గిస్తాడు.

శ్రీలతా, ఆశా యిద్దరూ మానవులే, స్త్రీలే. కాని మన స్తత్వాలు వేరుగావుండవచ్చు. ఇలాంటి ఆలోచనతోనే, తను ఎన్నోరాత్రులు నిద్రలేక గడిపాడు.

ఆశాకు యిప్పుడు ఆరవనెల. ఆమె పుట్టింటికి వెళ్ళడానికి నిరాకరించింది. తను యిక్కడేవుండి, పురుడు పోసుకుంటానంది. తను యిపుడు కాంపుకువెళ్తే నాలుగయిదురోజులుకూడా వుండవలసి వస్తూంది. ఇంటిదగ్గర బంట్రోతును రాత్రిళ్ళు పడుకోమనిచెప్పి వెళ్ళేవాడు.

ఆరోజు జీపులో ప్రొద్దుటే బయలుదేరాడు. ఆశాకు బాబు జాగ్రత్త నీఆరోగ్యంజాగర్త అని వెళ్ళాడు.

తను ఐదోరోజునగాని కాంపునించి తిరిగిరాలేకపోయాడు. వస్తూంటే దార్లో రుండుపిల్లి ఒకటి జీపుకు అడ్డంగా పరుగెత్తింది. దూరంగా ఎక్కడో కుక్కలు రోదిస్తున్నాయి.

జీపు యింటిఆవరణలో దిగింది. రవిదిగి లోపలకు వెళ్ళాడు. సామాను తీసుకొని డ్రైవరు వస్తున్నాడు.

ఇల్లంతా నిశబ్దంగావుంది. ఎవరూ వున్నట్టు అలికిడి లేదు. లోపలగదిలోకి వెళ్ళగానే, అడుగుల చప్పుడుకు ఆశా బాబు మంచందగ్గరనుంచి లేచి 'ఏమండీ!' అంటూ వచ్చి వాటేసుకుంది.

ఆమె శరీరం భయకంపితమై వణికిపోతూంది. 'మన బాబు మనకు దూరమయ్యాడండి' అని ఏడుస్తూంది.

నాకంతా అయోమయంగావుంది. మంచందగ్గరకు వెళ్ళిచూశాను. బాబు, భౌతికదేహంమాత్రం యీలోకంలోవుంది.

'బాబూ' అంటూ మీదపడిపోయాను.

'సాయంత్రంవరకు బాబు ఆడుతూనే వున్నాడు. కానీ రాత్రికి యీఘోరం జరిగింది బాబూ' అని నాకరు మాటలు వెనకనించి వినిపించాయి.

నాలోని అనుమానాలన్ని ఒక్కసారి విజృంభించి, ఆవేశంగానూ మారాయి. బాబు అమాయక మొహము చూస్తూంటే తనలోని అనురాగం పరువళ్ళుత్రొక్కి, క్రోధం, అనుమానాలు పెల్లుబికాయి.

'అది అకాలమృత్యువుకాదు. హత్య' అని అరిచాను.

'ఏమిటీ, మీర నేది...'అంటున్న ఆశామాటలకు అడ్డువచ్చి,

'నీసంతానభవిష్యత్తుకు, ఈకసుగాయి అడ్డుకదా అని నువ్వే వీడిని హతమార్చావు. పాపీ! నీకు మానవ హృదయంవుందా? నిర్మలహృదయంతో వాడిని సాకుతానని నీకు వప్పచెప్పితే, నీమలిన మనస్సుకు వాడిని ఆహూతి చేస్తావా?' అంటూన్నప్పుడు ఆమెకేకకూడా నాకు వినిపించి వుండదు.

'బాబూ, అమ్మగారు' అంటున్నమాటకూడా వినిపించుకోకుండా, బాబును చేతుల్లోకి తీసుకొని, తను బయటికి వచ్చేశాడు.

* * *

తనకు ఏచేతులతో నైతే పెంచి పెద్దచేయవలసిన బాధ్యతను శ్రీలత అప్పగించిందో, ఆ హస్తాలతోనే, స్వంతకుమారుని కాటికి తీసుకువెళ్ళిన, తను దుర్మార్గుడు. పాముకు పాలుపోసినా విషంగ్రక్కినట్లు సవతితల్లి మారాటి తల్లే.

ఆశాసహకారము, సానుభూతి తనకు ఎల్లప్పుడూ వుంటాయనుకున్న తను పొరపాటుపడ్డాడు.

తనొక నిర్భాగ్యుడు. బాబొక అభాగ్యజీవి తనజీవితానికి ఆశా ఒకచీవుపురుగు. ఇలా ఆలోచించుకుంటూ, చినుకలలో తడుస్తూ అంతులేని ప్రయాణాన్ని సాగిస్తున్నాడు.

ఆదే సమయంలో తన హృదయం మరోలాఅలోచిస్తూంది.

తను ఆమెను ఎందుకు అనుమానించాలి? పుత్రప్రేమ కొద్ది ఆమెపై నిందమోపాడేకాని, ఆమెకు బాబుపై గల ప్రేమ, వాత్సల్యం తనకి తెలియనివికావు. ఒక్కసారి యిలా చేస్తుందని, వూహించలేదుకూడా.

ఆమె కడుపుతోవుంటేమటుకు, పెంచినప్రేమను కాలదన్నుకుంటుందా? కన్నప్రేమకన్నా పెంచినప్రేమ గొప్పదంటారే, ఇన్నాళ్ళనుంచిలేనిది, యిప్పుడు ఆమెకు యీ కుతంత్రబుద్ధి ఎలాకల్గింది? తను ఆలోచనలలో ఎటూ దరిచేరటంలేదు.

RETURNED AFTER SUCCESSFUL BUSINESS TOUR



MR. D. ,G. Dharmar. L. P. T. Sales Manager and Partner, The Coronation Litho Works, Sivakasi, has returned on 20-9-63 after a successful business tour of Malaya, Singapore, Thailand. Philippines and Japan.

వెనక టపటప అడుగులధ్వని వినిపిస్తే, తిరిగి చూశాడు. నౌకారు వగర్చుకుంటూ, 'బాబూ అమ్మగారు అపాయంలోవున్నారు. క్రిందపడిన దగ్గరనుంచీ, ఒకటే బాధపడుతున్నారు.' అన్నాడు.

వెంటనే యింటివైపుకు పరుగత్తాను. అవునుమరి, మమతలు త్రెంచుకున్నా తెగవు.

రవి యింటిలో కళ్ళేసరికి, ఆశా నేలమీదపడి, కడుపుపట్టుకొని బాధపడుతోంది. ఆమెనోటంట నురుగులు వస్తున్నాయి. 'ఆశా ఏమిటిది, ఏమయింది' అని అడిగినా ఆమె మాట్లాడలేదు. పరిస్థితి అర్థమయింది. శరీరం కంపించింది.

వెంటనే ఆమెను చేతులలోనికి తీసుకుని, 'డ్రైవర్, జీపు హాస్పిటలుకుపోనీ' అని అరచి తను ఆమెను వెనుక సీటులో ఒళ్ళో పడుకోబెట్టుకున్నాడు.

హాస్పిటలు ఆ ప్రదేశానికి కనీసం ఎనిమిదిమైళ్ళదూరం వుంటుంది. డ్రైవరు జీపును తారురోడ్డుపై జోరుగా పోనిస్తున్నాడు. రవిహృదయం పశ్చాత్తాపంతో మూలుగుతోంది. తను తొందరపడి ఆశాను అనుమానించాడు. నిందించాడు. ఆమె ఆరోగ్యపరిస్థితి గమనించకుండా, హృదయాన్ని ఘాతపరిచాడు. తన జీవితపథంలోనికి ప్రవేశించిన ఏజీవీకూడా సుఖపడి ఎరుగదు.

ఆశా నెమ్మదిగా కళ్ళుతెరచి 'ఏమండీ' అంది. ఆతృతగా ఆమెవైపు చూశాను.

'ఆశా, నేనొక దుర్మార్గుడను. అనవసరంగా అనుమానించాను. నీకొచ్చినభయంలేదు. నిన్ను హాస్పిటలుకు తీసుకు వెడుతున్నాను.' అన్నాను గద్గద కంఠంతో.

ఆమె కంటినుండి అశ్రువులుకారుతున్నాయి.

'మనకు బాబు ముద్దుముచ్చటలను చూసేయోగంలేదు. అందుకు విచారించి లాభంలేదు ఆశా!' అన్నాడు కళ్ళను తుడుచుకుంటూ.

'నేను నిరపరాధినని మీరుగుర్తిస్తే నాకదేచాలు...' ఆమె గొంతువణుకుతోంది. మాటలు బహిర్గతం కావటంలేదు. 'మిమ్మల్ని...కంటరచేసి...వెళ్ళిపోతున్నాను... క్షమించం...' అంటూ ఆమె తలను వాల్చేసింది.

జీపు హాస్పిటలు ఆవరణలో ప్రవేశించింది. ఆశా ఆత్మ అంతరాల్లోకి పారిపోయింది.